క్లుప్తంగా

నేడు రక్షిత మంచినీటి సరఫరా నిలిపివేత

తెనాలిఅర్బన్: తెనాలి ఐతానగర్ లింగారావు సెంటర్‌లోని పైపులైన్ మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో రక్షిత మంచినీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీపార్కు ఏరియాలో గండిపాటి వారి వీధి, సిద్ధార్థ నగర్, ఎస్‌వీఆర్ కాలేనీ, నందులపేట, గాంధీనగర్, బీసీ కాలనీ, లక్ష్మీనగర్, దానబోయిన వారి వీధి, పురుషోత్తమ వారి వీధి, బుర్రిపాలెం రోడ్డు, నాజర్‌పేట, తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా జరగదని చెప్పారు. ఆ ప్రాంతవాసులు సహకరించాలని కోరారు.

12న సర్వసభ్య సమావేశం

కొల్లిపర: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఈనెల 12న మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్ని ఆయా శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలను పూర్తిస్థాయిలో వివరాలు తీసుకుని కార్యక్రమంలో తెలియజేయాలని సూచించారు. సభకు రాని అధికారులపై తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు కొణిజేటి రమేష్ కృష్ణ పుట్టిన రోజును పురస్కరించుకుని నాజర్‌పేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లోని విద్యార్థులకు అవసరమైన స్టీల్ ప్లేటులను శుక్రవారం ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ళ కృష్ణమోహన్ మాట్లాడుతూ పేద విద్యార్థులను అదుకునేందుకు అనేక సేవా కార్యక్రమాలు తమ సంస్థ ద్వారా చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రమణ్యం, నాయకులు డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, నంబూరి శ్రీకుమార్, ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈ నెల 11న మధ్యాహ్నం 3గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ షేక్. షహేలా నర్గీస్ అధ్యక్షత వహిస్తారని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సీజన్ వ్యాధులపై అవగాహన

ఎర్రబాలెం(క్రోసూరు):మండలంలోని ఎర్రబాలెం గ్రామ సచివాలయం-3 పరిధిలో ఏఎన్ఎం స్వప్న, ఎంఎల్‌పీహెచ్ రజనీ, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అదేవిధంగా అతిసార విషయంలో ప్రజల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై స్టాప్ డయేరియా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌పీహెచ్ మాట్లాడుతూ అతిసార బారిన పడకుండా పరిసరాలు పరిశుభ్రత, తాగునీటిపై అవగాహన కల్పించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు, పెద్దలకు వాంతులు, విరోచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అతిసార సమస్యలుంటే వెంటనే పీహెచ్‌సీలో తెలిజేయాలని కోరారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

ఫిరంగిపురం: మండల కేంద్రంలో శుక్రవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబులు హాజరై ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యా శాఖలో పెను మార్పులు తీసుకువస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జీవో-117 రద్దు చేయాలని, విలీన విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, పీఆర్సీ కమిటీ రిపోర్టు ఆలస్యమవుతున్నందున సత్వరం ఐఆర్ ప్రకటించాలని కోరారు. అనంతరం అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు సహకరించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: డయేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే కలుషిత ఆహారం నీటిని తాగవద్దని చెప్పారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాంతులు, విరోచనాలు అవుతుంటే వెంటనే వైద్యశాలకు వెళ్లి చూపించుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగడం, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవడం చేయాలన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ డయేరియా నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుదని చెప్పారు. వైద్యశాలలో అవసరమైన మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలోని వైద్యారోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వాతావరణంలో వస్తున్న మార్పులను అందరూ గమనిస్తూ తమ ఆహారపు అలవాట్లను దానికి అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గాంధీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. డయేరియా పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీపీ సుబ్బారావు, ఏఈలు రాజు, చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, డీఈ శ్రీనివాసరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, మలేరియా, ఫైలేరియా అధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాలు



కొల్లిపరలో డ్రెయినేజీ పూడిక తీయిస్తున్న సర్పంచ్ రాధిక

కొల్లిపర: వర్షాకాలం కావటంతో గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో సర్పంచ్ పిల్లి రాధిక పంచాయతీ సిబ్బందితో ప్రధాన రహదారుల వెంట డ్రెయినేజీ, ఎస్సీ కాలనీలో రెండు చోట్ల జేసీబీతో కొన్ని చోట్ల మురుగు తొలగించడం, చెత్తను తొలగించడం, బ్లీచింగ్ చల్లించడం పనులు చేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండటం వలన దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి కావున కొల్లిపరలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డ్రైయినేజీ పూడిక, మురుగు కాల్వలు చేయటం జరుగుతుందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం వలన అనేక రోగాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండవచ్చు అని ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రధాన రోడ్డు వెంట ఉన్న టీస్టాల్, వివిధ దుకాణంలో ఉన్న కాగితాలు, చెత్త డ్రెయినేజీలో వేయకుండా పంచాయతీ వారు అందించిన బుట్టలో వాటిని ఉంచి పారిశుద్ధ్య కార్మికులు వచ్చిన సమయంలో ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. డ్రైయినేజీలో టీ గ్లాసులు, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయటం వలన చెత్త మురుగుకు అడ్డుగా ఉందని, ఎక్కడక్కడ చెత్త పేరుకు పోవటం జరుగుతోందని వివరించారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా మురుగు సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వార్డు మెంబర్ కమల కుమారి, పిల్లి గంగాధర్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రేపు 'మానవత' ప్రథమ వార్షికోత్సవం

- నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం
- జీవన సాఫల్య పురస్కారం ప్రదానం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తెనాలి: రాష్ట్రవ్యాప్తంగా విస్తృత సేవాకార్యక్రమాలను నిర్వహిస్తున్న మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తెనాలి శాఖ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఏస్టేట్‌లోని కుమార్‌పంప్స్ సత్సంగ్‌హాలులో ఉదయం 10 గంటలకు జరిగే సభలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం, జీవనసాఫల్య పురస్కారం ప్రదానం ఉంటాయి. సత్సంగ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్‌లు కార్యక్రమ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఓదార్చి ఒక కన్నీటి బొట్టునైనా ఆపడమనే 'మానవత' ఆశయంతో ప్రారంభించిన సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 112 శాఖలు, 76 వేల మంది సభ్యులకు పైగా విస్తరించినట్టు డాక్టర్ రామ్‌చంద్ తెలిపారు. అందులో భాగమైన తెనాలి శాఖ ఏడాది కాలంలో వినూత్న సేవలను అందించినట్టు గుర్తుచేశారు. తొలి జీవన సాఫల్య పురస్కారాన్ని మానవతామూర్తి డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్‌కు బహూకరించనున్నట్టు చెప్పారు. నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. సంస్థకు ప్రస్తుతం 500 మంది సభ్యత్వం ఉందనీ, రానున్న ఏడాదిలో సభ్యత్వాన్ని వెయ్యిమందికి పెంచాలని నిర్ణయించామని తెలిపారు. వార్షికోత్సవం రోజు నుంచి సంస్థ సేవలను విస్తరిస్తామని రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం చెప్పారు. స్వచ్ఛంద సేవపై ఆసక్తి గలవారు సభ్యులుగా చేరి, తమ సేవలను సంస్థ ద్వారా చేపట్టాలని సూచించారు. సంస్థ నూతన అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారి సేవల కోసం ఆవిర్భవించిన సంస్థ సేవలను ముందుకు తీసుకెళతామని చెప్పారు. కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు మాట్లాడుతూ, తెనాలి సమీపంలోని కుంచవరంలో నిర్మించిన మానవత ప్రాంగణంలో మహిళల ఉపాధి కేంద్రం, యువతకు ఉపాధి శిక్షణ, జీవన కళల శిక్షణ అవకాశాలను ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గౌరవ సలహాదారు వెంపటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు (వాసు), కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎస్‌వీ శర్మ, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్య శాస్త్రి, కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సీహెచ్ సాంబశివరావు, కె.నాగేశ్వరరావు, ఎం.అర్జున, యడవల్లి రోహిణి, పి.మల్లిఖార్జునరావు, ఆర్.భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం, సాలిగ్రామ మఠం ట్రస్ట్, తెనాలి ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర శాంతి మహాయజ్ఞం 23వ రోజైన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ హోమం, నక్షత్ర శాంతి హోమం, మృత్యుంజయ హోమాన్ని యల్లాప్రగడ పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు జరిపించారు. ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) భక్తుల నుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు లక్ష మల్లెపూజ నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, రావూరు సుబ్బారావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, గోపు రామకృష్ణ, ఏలూరి రాజేశ్వరరావు, చుండూరి రాంబాబు, మురికిపూడి కాశీవిశ్వనాథం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు గోపు ప్రభారాణి, గుర్రం పద్మ, సువర్ణ, కనికిచర్ల జానిక, లక్ష్మీకుమారి, చుండూరు వరలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

అలరించిన సింహాచలశాస్త్రి హరికథా గానం



తెనాలి: పట్టణ శ్రీసీతారామ గాన సభ ఆధ్వర్యంలో ఇక్కడి రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరుగుతున్న శాస్త్రీయ సంగీత కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం 'భక్త రామదాసు' హరికథా గానం జరిగింది. కథకులు డాక్టర్ ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి భాగవతార్ భక్తరామదాసు చరితను రసవత్తరంగా హరికథాగానం చేశారు. హరికథ రత్న బ్రహ్మశ్రీ దుర్భా వెంకటశాస్త్రి భాగవతార్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పామర్తి ఆంజనేయ శాస్త్రి వయొలిన్‌పై, కందుల అనిల్‌కుమార్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. శ్రీసీతారామ గాన సభ అధ్యక్షురాలు పిరాట్ల రమణి, ఉపాధ్యక్షుడు దుర్భా కౌండిన్య సాయి, కోశాధికారి పరుచూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి కేవీ రామకృష్ణ, సభ్యులు దుర్భా జస్వంత్, డాక్టర్ చింతలపాటి మంజుల పాల్గొన్నారు. ప్రవాస భారతీయులు పవన్ రామ్, కళ్యాణ్ రామ్ ప్రత్యేకంగా విచ్చేశారు.

రేపు 'రఫీ సాబ్‌కే యాద్‌మే' సంగీత కచేరీ



కరపత్రాన్ని ఆవిష్కరించిన డాక్టర్ పురుషోత్తమరావు

తెనాలి: పట్టణానికి చెందిన సంకీర్తన సంస్థ ఆధ్వర్యంలో అమరగాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా 7వ తేదీన 'సుహానీ షామ్', 'రఫీ సాబ్‌కే యాద్‌మే' పేరుతో 7వ వార్షిక సంగీత కచేరీ నిర్వహించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి రాత్రి 9 గంటల వరకు సంగీత కార్యక్రమం జరుగుతుందని సంకీర్తన వ్యవస్థాపకుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు వెల్లడించారు. కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. గాయనీ గాయకులు షేక్ బి.సైదా(తెనాలి), పీఎల్ ఆలీఖాన్ (పొన్నూరు), షేక్ ఖాజా షానవాజ్ (హైదరాబాద్), శారదా రాజా (హైదరాబాద్), ఎం.మల్లిక (తెనాలి), కె.రాజేశ్వరరావు, డాక్టర్ కె.పురుషోత్తమరావులు రఫీ గాత్రంలోంచి జాలువారిన చక్కని గీతాలను ఆలపిస్తారని వివరించారు. సంగీతాభిమానులు, రఫీ ప్రేమికులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

ఎరువుల సమతుల్యలతతో అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి



రైతులకు సూచనలు చేస్తున్న డాక్టర్ గంగాదేవి

తెనాలిరూరల్: ఎరువులను సమతుల్యంగా వినియోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని లాంలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు సమతుల ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) గుంటూరు, గుంటూరు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి మండలం నందివెలుగు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాదేవి మాట్లాడుతూ రైతులకు సమతుల ఎరువుల యాజమాన్యంపై తగు సూచనలు చేశారు. మట్టి పరీక్షల ఆధారంగా తగు మోతాదులో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఆత్మ గుంటూరు డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇ.వెంకటేశ్వర్లు వరి యాజమాన్య పద్ధతులపై సూచనలు అందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వనరుల కేంద్రం, ఏఈఓ మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు మౌనిక, గ్రామ రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

పాఠశాల విద్య డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేత



పాఠశాల విద్యా డైరెక్టర్ పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భూషణం, కె.భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో పాఠశాల విద్యా డైరెక్టర్ పి.పార్వతిని కలసి, వినతిపత్రం అందజేశారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు 40 వేలు ఉన్నాయని, వీటిలో సుమారు 35.69 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యా కానుక కిట్లు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇంకా పూర్తిస్థాయిలో అందించలేదని అన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని, దానికి సంబంధించిన జీఓ నెం.84, 85, 117లను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ జీవోల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 5,400 పాఠశాలలు మూతబడ్డాయని, తక్షణమే ఈ జీఓను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి, సహాయ కార్యదర్శి కె.నాని పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారిణి శ్రీ రంజని

వడ్డమాను(తాడికొండ): కౌలు రైతు గుర్తింపు(సీసీఆర్‌సీ) కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తుళ్ళూరు మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీరంజని తెలిపారు. తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీపై సంయుక్తంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. ఏఓ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. పొలం లేకుండా కౌలుకు పంట సాగు చేసే రైతులు, సొంత పొలం ఉన్నప్పటికీ కౌలుకు పొలం తీసుకొని సాగుచేసే రైతులు ఈ సీసీఆర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దీని వల్ల పంట నమోదుతో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట నష్టం వాటిల్లినపుడు ప్రమాద బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పొందే అకాశం ఉందన్నారు. రైతులు పొలం పాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, భూమి కలిగిన రైతు ఆధార్ జెరాక్స్‌లు, పాస్‌పోర్టు ఫోటోలను వీఆర్‌వోకి లేదా రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వరి పండించే రైతులకు రాయితీ వరి విత్తనాలు అందజేశారు. పిన్నక సాంబశివరావు, వెంకటరెడ్డి, పారు బుజ్జి, కొమరా బత్తిని శేఖర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం ఆవరణలో శుక్రవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు పసుపులేటి గణేష్ మాట్లాడుతూ అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జమ్మి, ఉసిరి మొక్కలను నాటామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొంగర జోగేంద్ర ప్రసాద్ దంపతులు, పాటిబండ్ల రాజారావు, యెద్దు కిషోర్, సిద్ధు, పి.ప్రదీప్, దానబోయిన చంద్ర, భాస్కరరావు, ఆలయ ఈఓ చినవెంకటరెడ్డి పాల్గొన్నారు.

భూ అధీకృత చట్టం పునరుద్ధరణకు సంతకాల సేకరణ

మేడికొండూరు: భూ అధీకృత చట్టం -2011 పునరుద్ధరించాలని సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం మందపాడు, పొట్లపాడు గ్రామాల్లో జరిగింది. రైతు సంఘ మండల నాయకులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ 2019 సీసీఆర్సీ కౌలు చట్టం రద్దు చేసి 2011లో భూ అధీకృత చట్టం పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేశారు. కౌలు రైతులు ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసేందుకు సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో విత్తన దుకాణాలపై అధికారులు తనిఖీలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు డెప్యూటీ తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు తెలిపారు. అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విక్రయాలపై ఎలాంటి అవకతవకలు జరిగినా ఆయా షాపుల లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి మన్నవ నాగరాజు పాల్గొన్నారు.

● సర్వమంగళ...



తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్, గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూరోడ్‌లోని చారిత్రక గోవర్ధన్ స్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పూజలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం 10 గంటల నుంచి మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిషత్, గుంటూరు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ ఈ.అమ్మడు హాజరయ్యారు. వైఖానస ఆగమరీత్యా జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు టి.రఘు, వేదాంతం మాధవ్ కుమార్, టి.శ్రీధర్, వేదాంతం కేశవమూర్తి తదితరులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి, కార్యక్రమ నిర్వాహకులు వంశీ, సాయి, చంద్రమౌళి పాల్గొన్నారు. -తెనాలి